ప్రేమికుడు మోసం చేశాడని..యువతి ఆత్మహత్య

యాచారం, మార్చి 25, ప్రభాతవార్త : అనుమానస్థితిలో యువతి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండల పరిధిలోని నజ్దిక్ సింగారం గ్రామానికి చెందిన మండల పద్మకిష్టయ్యల చిన్న కుమార్తె అఖిల (23) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. డైట్ సెట్ పూర్తి చేసుకొని టెట్లో క్వాలిఫై అయి డీఎస్సీ కోసం సిద్ధం అవుతోంది. యాచారం అనుబంధ గ్రామమైన గాండ్లగూడ చెందిన ఓ యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకుంటన్నాని నమ్మించి, మరో యువతితో పెళ్లికి సిద్ధమైన విషయం తెలుసుకొని మనస్థాపాన్ని గురై ఆత్మహత్య చేసుకున్నారని అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలుడు

ఆరుగురికి పైగా తీవ్రగాయాలు?

పరిగి, మార్చి 25, ప్రభాతవార్త : వికారాబాద్ జిల్లా పరిగి మండలం లక్ష్మీదేవి పల్లి శివా రులోని సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో బుధవారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. రియాక్టర్ ఒక్కసారిగా పేలిపోవడంతో ఆరుగురు పైగా కార్మికులకు తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ఫ్యాక్టరీ యాజమాన్యం గోప్యంగా ఉంచింది. ఘటనా స్థలంలోకి మీడియాను వెళ్లకుండా నిరోధించారు. పేలుడుతో భయభ్రాంతులకు గురయ్యామని పరిసర గ్రామాల ప్రజలు తెలిపారు. పోలీసులు, రెవెన్యూ, ఫైర్ అధికారులు ఫ్యాక్టరీకి కెళ్లి పరిశీలించారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

ఇందనాధీన

రంగారెడ్డి జిల్లాలో బుధవారం ఓ బంకు వద్ద రద్దీ దృశ్యం

హైదరాబాద్‌లో సిఎన్‌జి గ్యాస్ కోసం బారులు తీరి నిలిచిన ఆటోలు

- పెట్రోల్ కొరత వదంతులతో జిల్లాలో భారీ కొనుగోళ్లు
- బంకుల వద్ద పోటెత్తిన జనం
- వేకువజాము నుంచే భారీగా క్యూ
- టిన్నులు, క్యానుల్లో సైతం తీసుకెళ్లిన చిరువ్యాపారులు
- ఇందనం కోసం కిలోమీటర్ల మేర ప్రధాన రహదారులపై పడిగాపులు
- గంటల వ్యవధిలో ఖాళీ అయిన పెట్రోల్, డీజిల్ నిల్వలు
- రద్దీని తట్టుకోలేక నో స్టాక్ బోర్డులు పెట్టిన నిర్వాహకులు
- ఒక్కో బంకులో 4వేల లీటర్ల నుంచి 12 వేల లీటర్లకు పెరిగిన అమ్మకాలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 25, ప్రభాతవార్త: పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు రంగారెడ్డి జిల్లాలలో ప్రకంపనలు సృష్టించాయి. బుధవారం పెట్రోల్ బంకులకు వాహనదారులు పెద్ద ఎత్తున పోటెత్తారు. మరోవైపు.. ఎల్పీజీ, సీఎన్‌జీ గ్యాస్ కొరత కారణంగా గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద కూడా ఆటోలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. డబ్బులు చెల్లిస్తేనే పెట్రోల్, డీజిల్ బంకులకు సరఫరా చేస్తామంటూ ఆయిల్ కంపెనీలు.. ఇటీవలి కాలంలో కొత్తగా మెలిక పెడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో సమస్య రోజు రోజుకు తీవ్రరూపం దాల్చి ఇందన కొరత భారీగా ఏర్పడుతుందని సోషల్ మీడియాలో వార్తలు వెల్లువెత్తడంతో వినియోగదారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. రంగారెడ్డి జిల్లాలోని కీలక ప్రాంతాలైన శంషాబాద్, ఆమనగల్, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, మహేశ్వరం, మాడ్గుల, కందుకూరు, చేవెళ్ల పరిసర ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత విషమంగా మారింది. తెల్లవారుజామున 5 గంటల నుంచే బంకుల వద్ద వాహనాల క్యూలు మొదలయ్యాయి. రహదారుల వెంట కిలోమీటర్ల మేర ద్విచక్ర వాహనాలు, కార్లు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తాయి. గంటల తరబడి లైన్లో వేచి చూసినా, తీరా తమ వంతు వచ్చేసరికి ఇందనం అయిపోయిందని బోర్డులు పెడుతుండటంతో వినియోగదారులు బంక్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

మీడియాతో మాట్లాడుతున్న సిపి సజ్జనార్, కలెక్టర్ హరిచందన దాసరి

60 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయ్

అనవసరంగా ఫుల్ ట్యాంకులు చేయించవద్దు

బాటిళ్లు, డబ్బాల్లో విక్రయిస్తే కఠిన చర్యలు

-హైదరాబాద్ సిపి సజ్జనార్

హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త: నగరంలో ఇందన కొరత ఉందంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పష్టం చేశారు. నగరంలో దాదాపు 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని వెల్లడించారు. ఇందన సరఫరాపై తలెత్తిన అపోహల నేపథ్యంలో బుధవారం టీజీసీసీసీలో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు సీపీతస్పీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ శ్వేత, సివిల్ సప్లై అధికారులతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ ఆయిల్ కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, నగరవ్యాప్తంగా సరఫరా నిరాటంకంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు ఒక్కసారిగా పెట్రోల్ బంకులకు వచ్చి వాహనాలకు ఫుల్ ట్యాంకులు చేయించుకోవడం వల్ల అకస్మాత్తుగా డిమాండ్ పెరిగి, కొన్ని చోట్ల తాత్కాలికంగా నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయని, దీనిని కొరతగా భావించవద్దని కోరారు. తప్పుడు ప్రచారాల వల్ల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 22న 3,024 కిలోలీటర్ల ఇంధనం అమ్ముడవగా, 23న ఆ సంఖ్య రెట్టింపై 6,400 కిలోలీటర్లకు చేరుకుందని, జనం భయాందోళన చెందడం వల్లే అమ్మకాలు ఈ స్థాయిలో పెరిగాయని తెలిపారు. ముఖ్యంగా నిబంధనలకు విరుద్ధంగా బాటిళ్లు, డబ్బాల్లో లూజ్ పెట్రోల్ డీజిల్ విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేసే వారిపై నిఘా ఉంచామని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలోని 240 పెట్రోల్ బంకుల్లో పరిస్థితిని సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన మాట్లాడుతూ.. ఆయిల్ సంస్థలు, సివిల్ సప్లై అధికారులతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రజల సౌక ర్యార్థం ప్రత్యేకంగా కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఎందుకిలా...?

- చెల్లింపు విధానాల్లో మార్పు వల్లే అంటున్న బంకు నిర్వాహకులు
- ఆయిల్ కంపెనీలు ఉద్దేశ పూర్వకంగానే ఇబ్బంది పెడుతున్నాయని ధ్వజం
- కొరత లేదని పౌరసరఫరాలశాఖ చేతులుదులుపుకుంటోందని ఆరోపణ
- క్లిష్ట సమయంలో కొత్త మార్పులు తగదని అభ్యర్థన

హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త: ఎంకి పెళ్లి సుబ్బి సావుకు వచ్చినట్లు ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ దేశాలు అల్లాడిపోతున్నాయి. డిమాండ్‌కు సరఫరా చమురు లభ్యత లేకపోటవంతో చాలా దేశాల్లో వంట గ్యాస్‌తో పాటు ఇంధన కొరత ఏర్పడింది. ఇప్పుడు ఆ సెగ హైదరాబాద్ నగరాన్ని కూడా తాకింది. నగరంలో పెట్రోల్, డీజిల్ లభ్యతపై ఆందోళన నెలకొంది. జనం బంకుల ముందు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా పలుచోట్ల స్టాకు అయిపోయి పెట్రోల్ బంకులు మూతపడ్డాయి. అయితే ఇందుకు గల కారణాలను పరిశీలిస్తే గతంలో ఆయిల్ సంస్థలు డబ్బులు తీసుకోకుండానే తొలుత డీజిల్, పెట్రోల్ బంకులకు సరఫరా చేసేవి. స్టాక్ సేల్ అయ్యాక ఒకటి రెండు రోజుల తర్వాత బంకుల యజమానులు ఆయిల్ సంస్థలకు తిరిగి డబ్బులు చెల్లించేవారు. కానీ మూడు నాలుగు రోజులుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎంత ఇంధనం కావాలంటే ఆ మేరకు డబ్బులు చెల్లిస్తేనే పెట్రోల్, డీజిల్ సరఫరా చేస్తామని ఆయిల్ సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో నగరంలో పలు బంకులకు సరఫరా నిలిచిపోయింది. పాతబకాయిలు వెంటనే చెల్లించాలని కొత్తగా స్టాక్‌కు డబ్బులు ముందే చెల్లించాలని ఆయిల్ సంస్థలు చెబుతుండడంతో నిర్వాహకులు సమయానికి డబ్బులు చెల్లించకపోవడంతో ఆయిల్ సరఫరా కావడం లేదు దీంతో పెట్రోల్ ఉన్న బంకులపై ఒత్తిడి పెరిగి ఒక్క రోజులోనే స్టాకు అయిపోతోంది. మళ్లీ స్టాకు వచ్చేవరకు ఆయా బంకులు మూతపడుతున్నాయి. కాగా,ఆయిల్ కంపెనీలు ఉద్దేశ పూర్వకంగానే ఇబ్బందులకు గురిచేస్తున్నాయని బంకుల యజమానులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కొత్తగా మార్పులు తీసుకురావటం సరైందికాదని అంటున్నారు. ఆయిల్ కంపెనీలు, పెట్రోల్ బంకులు మధ్య ఏర్పడిన వివాదంతో హైదరాబాద్ నగరంలో పెట్రోలు బంకులు మూతపడుతున్నా పౌరసరఫరాలశాఖ చోద్యం చూస్తోందని బంకుల యజమానులు వాపోతున్నారు. పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని చేతులు దులిపేసుకుంటున్నారే తప్ప కావాల్సిన చర్యలు తీసుకోవటం లేదని విమర్శిస్తున్నారు.

కాగా, హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలో ఎక్కడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత లేదని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. డిపోలలో తగినంత ఇంధనం ఉందని అంటున్నారు. ప్రజలు అనవసరంగా ఆందోళనకు గురై తమ వాహనాలను ఫుల్ ట్యాంకులు చేసుకునేందుకు ఎగబడటం వల్ల కృత్రిమ కొరత ఏర్పడే ఛాన్స్ ఉందని హెచ్చరిస్తున్నారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ముందస్తు చెల్లింపు విధానాల్లో చేసిన కొన్ని మార్పుల వల్ల బంకు యజమానులకు తాత్కాలిక సమస్య ఏర్పడిందని చెబుతున్నారు.

ఆరుబయటే వంట!

చదువులు ఎలాగంట!

దుద్యాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

మరుగుదొడ్లకు వెళ్లటానికి పరుగుతీస్తూ రోడ్డుదాటుతున్న విద్యార్థినులు

- రెండే గదుల్లో 5 తరగతులు
- ఒక గదికి రెండు,మూడు క్లాసులు
- రణగొణ ధ్వనులతో బోధనకు ఆటంకం
- మధ్యాహ్న భోజనానికీ అవస్థలే
- ఎండయినా..వానైనా ఓపెన్ ప్లేస్‌లోనే తయారీ
- దుమ్ము..ధూళితో కలుషితం

దుద్యాల్, మార్చి 25, ప్రభాతవార్త : విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ప్రభుత్వం చెప్పున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. దుద్యాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి అయోమయం.. అగమ్యగోచరంగా మారింది. ఇక్కడ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 70 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి కేటాయించింది మాత్రం కేవలం రెండు చిన్న గదులు. ఒక గదిలో రెండు మూడు తరగతుల పిల్లలను కూర్చోబెట్టాల్సి వస్తోంది. దీంతో ఒక ఉపాధ్యాయుడు చెప్పే పాఠం మరో తరగతి విద్యార్థులకు ఆటంకంగా మారుతోంది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా స్థలం లేకపోవడంతో పిల్లలు ఊపిరి ఆడక, ఇరుకుగా కూర్చోలేక అవస్థలు పడుతున్నారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనాన్ని పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అభివృద్ధి చేయడంలో విద్యాశాఖ విఫలమైందని స్థానికులు మండిపడుతున్నారు.

బోధన సాగక అవస్థలు

కనీస వసతులు లేకపోవడంతో బోధన ప్రక్రియ పూర్తిగా కుంటుపడుతోంది. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఎవరికి ఏం అర్థం కాక సతమతమవుతున్నారు. ఇంతమంది పిల్లలు రెండు చిన్న గదుల్లో ఎలా చదువుకుంటారని తల్లిదండ్రులు అధికారులను నిలదీస్తున్నారు.

వంటశాల లేక....

ఈ పాఠశాలలో మరో ప్రధాన సమస్య వంటశాల లేకపోవడం. విద్యార్థులకు వండాల్సిన భోజనాన్ని వంట కార్మికులు అరుబయటే, చెట్ల కింద తయారు చేస్తున్నారు. దుమ్ము, ధూళి పడుతున్నా వేరే దారి లేక అక్కడే వంట కానివ్వాల్సి వస్తోంది. వర్షాకాలంలో గాలివాన వస్తే వంట చేయడం అసాధ్యంగా మారుతోందని, పిల్లలు ఆకలితో ఉండాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరుగు దొడ్లకు వెళ్లాలంటే రోడ్డు దాటాల్సిందే

కేవలం వసతుల లేమే కాదు, ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థుల ప్రాణాలు గాలిలో దీపాల్లా మారాయి. పాఠశాల ప్రాంగణానికి, మరుగుదొడ్లకు మధ్య ఉన్న ప్రధాన రహదారి ఇప్పుడు విద్యార్థులకు సింహస్వప్నంగా మారింది. పాఠశాలకు సంబంధించిన మూత్రశాలలు రోడ్డుకు అవతలి వైపున ఉన్నాయి. చిన్నారులు మూత్ర విసర్జనకు వెళ్లాలన్నా, తిరిగి రావాలన్నా కచ్చితంగా ప్రధాన రహదారిని దాటాల్సిందే. ఈ రహదారిపై వాహనాలు అతి వేగంగా దూసుకుపోతుంటాయి. పిల్లలు రోడ్డు దాటే క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వణికిపోతున్నారు. పిల్లలు బడికి వెళ్లినప్పటి నుండి ఇంటికి వచ్చే వరకు తమ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతకాల్సి వస్తోందని ఒక విద్యార్థి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల నిరక్ష్యంపై ఆగ్రహం

సర్కారు బడులను బలోపేతం చేసి పేద విద్యార్థుల చదువులకు దన్నుగా నిలుస్తున్నామని పాలకులు చెబుతున్నా... విద్యాశాఖ ఇక్కడి అసౌకర్యాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పిల్లల భవిష్యత్తును, భద్రతను దృష్టిలో ఉంచుకుని, వెంటనే తగిన వసతులతో పాఠశాల నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాల ఆవరణలోనే మూత్రశాలలు నిర్మించాలని, వంటశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కుశాయిగూడ జిల్లా కోర్టులో ఛాంబర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి జస్టిస్ వి.బాలభాస్కర్‌రావు,కలెక్టర్ మనుచౌదరి

2

జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్

మెడికల్ కాలేజీని రంగారెడ్డిలోనే ఉంచాలి

అసెంబ్లీలో సబితా ఇంద్రారెడ్డి డిమాండ్

రంగారెడ్డి ప్రతినిధి, మార్చి 25, ప్రభాతవార్త: అసెంబ్లీలో బుధవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో వైద్య, ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాకు మంజూరైన మెడికల్ కాలేజీ అంశంపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రభు త్వ కాలంలో రంగారెడ్డి జిల్లాకు ప్రత్యేకంగా మెడికల్ కాలేజీ మం జూరు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. మహేశ్వరం నియో జకవర్గ పరిధిలోని కందుకూరు వద్ద కాలేజీ ఏర్పాటు కోసం అవస రమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు

మిగతా 2లో

మైసిగండి సీతారాముల స్వామి ఆలయం

నేటి నుంచి మైసిగండిలో బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, మార్చి 25, ప్రభతవార్త : మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో రుగ్వేద కాలంనాటి గంగా గుళ్ళుగా పిలువబడే ఆలయములే శివాలయ రామాలయ ఆలయములు, ప్రతి ఏటా శ్రీరామనవమి పురస్కరించుకొని ఆలయాల్లో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు ఆలయం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మి మ్మ శిరోలి పంతు నాయక్, ఈఓ స్నేహలతల ఆధ్వర్యంలో పూర్తి ఏర్పాటు చేశారు. ఈనెల 26 గురువారం మొదటి రోజు విగ్నేశ్వర పూజ, అఖండ జ్యోతి స్థాపన, ధ్వజారోహణము, హోమశాల ప్రవేశము, 27న, శుక్రవారం మధ్యాహ్నం సీతారాముల కళ్యాణం మహోత్సవం, 28న, శనివారం ఉదయం చక్రతీర్థం, పుష్కరస్నానము, పూర్ణాహుతి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు, కళ్యాణ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ వారిచే ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రములు ఆనవాయితీగా సమర్పించబడును. సీతారాముల కళ్యాణం చూడడానికి హైదరాబాద్, మహబూబ్ నగర్, నల్లగొండ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్ళు, మంచినీటి వసతులు, అన్నప్రసాదాలు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న సీడిపిఓ రిజ్వానా బేగం.

బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

మోమిన్‌పేట్, మార్చి 25, ప్రభాతవార్త: పసి పాపలకు పాలిచ్చే తల్లులు స్థానికంగా దొరికే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసిడిఎస్ ఇంచార్జ్ సీడిపిఓ రిజ్వానా బేగం పేర్కొన్నారు. బుధవారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని కాస్లాబాద్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు స్థానికంగా దొరికే పోషకాహారాలను ప్రతి రోజు తప్పకుండా తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు పప్పులు ప్రతి రోజు మనం తినే ఆహారంలో ఉండేలా చూసుకోవాలని, ప్రతి రోజు అండన్‌వాడీ కేంద్రంలో లభించే ఒక పూట సంపూర్ణ భోజనాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే కార్యక్రమానికి వచ్చిన తల్లులతో వంట పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు పుష్పలత, ధనలక్ష్మి, వైష్ణవి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, పిల్లలు, ఆయాలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి సర్పంచుల మండల కమిటీ ఎన్నిక

తలకొండపల్లి మార్చి 25, ప్రభాతవార్త: తలకొండపల్లి మండలంలో నూతనంగా సర్పంచుల మండల కమిటీని ఎన్నుకున్నారు. తల కొండపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు అందరూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందారు. గెలుపొందిన సర్పంచులు అందరు సమావేశమై నూతనంగా సర్పంచ్ల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తల కొండపల్లి మండల కమిటీ సర్పంచుల సంఘం మండలగౌరవ అధ్యక్షులుగా చుక్కాపూర్ సర్పంచ్ మాకం వీరేశలింగం, అధ్యక్షులుగా తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శిగా వెంకట్రావుపేట సర్పంచ్ ఇమ్మడి మహేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు మండల ఉపాధ్యక్షులుగా కుర్ర శిరీష కృష్ణ, చంద్రశేఖర్, కడారి రామకృష్ణ యాదవ్, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా సొల్లు రంగమ్మతోపాటు మరికొంతమందిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు వీరేష్ లింగం, అధ్యక్షులు కటికల శేఖర్ యాదవులు మాట్లాడుతూ సర్పంచుల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం అధికారులు నాయకులతో చర్చించి వారి సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

బాలానందంలో వేసవి శిక్షణ శిబిరం

చిక్కడపల్లి మార్చి 25 (ప్రభాతవార్త) : పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు నారాయణగూడ స్థానిక ఆంధ్ర బాలానంద సంఘం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు జె.వి. కామేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో విద్యార్థులకు నృత్యం, లలిత సంగీతం, చిత్రలేఖనం వంటి పలు అంశాల్లో నిపుణులచే శిక్షణ ఇవ్వబడుతుంది. ఏప్రిల్ 29 నుండి మే 29 వరకు ప్రతి సోమవారం నుండి శుక్రవారం వరకు, ఉదయం 10:45 గంటల నుండి సాయంత్రం 3:45 గంటల వరకు తరగతులు జరుగుతాయి. ఆసక్తి గలవారు ఇతర వివరాల కోసం ప్రతిరోజూ ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 3:00 గంటల లోపు నేరుగా కార్యాలయంలో లేదా 8121023248 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

పేదల బతుకులకు భరోసా

జన్మభూమి సేవలో సుంకిరెడ్డి పునీతం

ఆమనగల్లు, మార్చి25, ప్రభాతవార్త: ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చేస్తున్న సమాజ సేవలు పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అమెరికాలో ఉన్నత చదువులు పూర్తి చేసి, మంచి ఉద్యోగంతో విలాసవంతమైన జీవితం గడిపారు. తన జన్మ భూమి రుణం తీర్చుకోవాలన్న సంకల్పంతో స్వగ్రామం వచ్చేశారు. కుటుంబ సభ్యుల సహకారంతో ఐక్యత ఫౌండేషన్ ను స్థాపించి విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా విద్య, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో ఆయన చేస్తున్న కృషి పలు పేదకుటుంబాలలో భరోసా నింపింది.

గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఉచిత మార్గదర్శక శిబిరాలు నిర్వహిస్తూ, ఉన్నత చదువులపై అవగాహన కల్పిస్తున్నారు. నిరుద్యోగ యువత కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణలు నిర్వహించి, స్వయం ఉపాధి అవకాశాలను సూచిస్తూ జీవనోపాధికి దారులు చూపిస్తున్నారు. చిన్న వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి సలహాలు, సహాయం అందిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో

వృద్ధురాలితో మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి(ఫైల్ ఫోటో)

పెట్టుకుని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ వైద్యులను తీసుకువచ్చి వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి కంటి ఆపరేషన్లు, అద్దాలు, మందులను ఉచితంగా అందజేశారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ టాస్క్‌లో కీలక బాధ్యతలు అప్పగించింది.

సర్కారు బడుల్లో అంతర్జాతీయ ప్రమాణాలు

విదేశీ విద్యా విధానంపై అవగాహనకు వెళ్లనున్న ఉపాధ్యాయ బృందం

వివిధ జిల్లాల నుంచి 28 మంది టీచర్ల ఎంపిక

ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి : విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యాలయాలలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించే విధంగా బోధనా ప్రక్రియను తీర్చిదిద్దాలని యోచిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం టీచర్స్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజీ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని చేపట్టింది. విదేశీ విద్యా విధానాన్ని అధ్యయనం చేసేందుకు ఫిన్‌ల్యాండ్, సింగపూర్, వియత్నాం, జపాన్ దేశాల్లో ప్రభుత్వ టీచర్లు పర్యటించనున్నారు. తొలి విడతగా ఏప్రిల్ 20 నుంచి 24 వరకు 40 మంది సభ్యులుగల ప్రతినిధుల (అధికారులు, టీచర్లు) బృందం ఐరోపాలోని ఫిన్‌ల్యాండ్‌లో పర్యటించనున్నది. వారిలో వివిధ జిల్లాల నుంచి 28 మంది ఉపాధ్యాయులను రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఎంపిక చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తరపున తాండూరుకు చెందిన కోయిలకొండ బాలాజీ ఫిన్‌ల్యాండ్

తాండూరు నుంచి ఫిన్‌ల్యాండ్ పర్యటనకు ఎంపికైన బాలాజీ

పర్యటనకు ఎంపికైనారు. ప్రస్తుతం ఆయన చేవెళ్ల మండలం దామరగిద్ద ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. ఫిన్‌ల్యాండ్‌లో పర్యటన ఉపాధ్యాయులకు వృత్తిపరమైన మెళకువలను, నైపుణ్యాన్ని మెరుగు పరిచేందుకు దోహదపడుతుందని అంటున్నారు.

అంతర్జాతీయ స్థాయి విద్యా విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఉత్తమ పద్ధతులను మన విద్యా వ్యవస్థలో అమలు చేయడానికి వీలవుతుంది. ఎంపికైన అభ్యర్థులకు వీసా ప్రక్రియ, ఇతర సూచనలపై బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. తాండూరు బాలాజీ ఎంపిక కావడం పట్ల ఈ ప్రాంత ఎంఈవోలు మహిపాల్‌రెడ్డి, వెంకటయ్య, ఉపాధ్యాయ సంఘం నేతలు జీ.నర్సిరెడ్డి, నాగప్ప, వెంకట్‌రాంరెడ్డి, శెట్టి విజయకుమార్, రాధాకృష్ణగౌడ్, సీ.కృష్ణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పరమేశ్, ధనసిరి మధు, రాములు తదితరులు అభినందించారు. త్వరలో మలి విడత సింగపూర్ పర్యటనకు యాలాల మండల ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి పేరు ప్రతిపాదనలో ఉన్నట్లు సమాచారం. తనకు వచ్చిన అవకాశం పట్ల బాలాజీ సంతోషం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి ఫిన్‌ల్యాండ్‌లో అధ్యయనం చేస్తానని తెలిపారు.

క్రైస్తవుల ఎస్‌సి హోదా రద్దుపై బిజెపి ఎస్‌సి మోర్చ హర్షం

ఘట్‌కేసర్, మార్చి 25, ప్రభాతవార్త: హిందూమతం నుంచి క్రైస్తవులు/ముస్లింలుగా మతం మారిన వారికి ఎస్‌సీ హోదా రద్దు అవుతుందని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని బిజెపి ఎస్‌సీ మోర్చ స్వాగతిస్తుందని మేడ్చల్ రూరల్ జిల్లా ఎస్‌సీ మోర్చ అధ్యక్షులు-మాజీ ఎంపిటిసి కప్పరగళ్ల కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దళితులమని చెప్పుకుంటున్న క్రైస్తవులు రిజర్వేషన్లను పొందుతుండటంతో ఎస్‌సీలకు అవకాశాలు తగ్గిపోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హిందుమతం నుంచి క్రైస్తవులుగా/ముస్లింలుగా మారిన వారు స్వచ్ఛందంగా తమ ఎస్‌సీ సర్టిఫికెట్లను రద్దు చేయించుకోవాలని లేకుంటే ప్రభుతమే అలాంటి వారిని గుర్తించి ఎస్‌సీ సర్టిఫికెట్లు రద్దుచేయాలని కోరారు. ఎమ్మెల్యే మందుల సామేల్ కూడా క్రైస్తవుడే కాబట్టి ఆయన కూడా ఎస్‌సీ సర్టిఫికెట్‌ను రద్దు చేసి ఎమ్మెల్యే పదవికి అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బిజెపి నాయకులపై సామేల్ పెట్టిన ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ కేసును కొట్టి వేసి అరెస్ట్ చేసిన నాయకులను పోలీసులు విడుదల చేయాలని కరుణాకర్ కోరారు.

రైలుకు ఎదురెళ్లి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్, మార్చి 25, ప్రభాతవార్త: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినసంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య కిఎం.215/2-4 వద్ద రైలుకు ఎదురుగా నిలబడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని బుధవారం అర్ధరాత్రి 2 గంటలకు సికింద్రాబాద్ డిప్యూటి ఎస్ఎస్ నుంచి సమాచారం రావడంతో జీఆర్‌పి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. డౌన్‌లైన్‌లో వస్తున్న 12764 పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటాడని తెలిపారు. మృతున్ని రైలు అరకిలోమీటరు దూరం (20 కరెంట్ స్తంభాలు) చీల్చుకువెళ్లడంతో శరీర భాగాలు పూర్తిగా చిద్రమై అవయవాలు ముక్కలు, ముక్కలైయ్యాయి. మృతుడు నీలిరంగు జీన్స్‌ప్యాంట్, ముదురు ఆకుపచ్చ నెక్‌టీషర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వద్ద ఏలాంటి ఆధారాలు లభించకపోవడంతో వివరాలు సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఆమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని మృతుని వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని జీఆర్‌పి 8712658581, 9392745915లకు సంప్రదించాలని రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్‌గౌడ్ తెలిపారు.

జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 25, ప్రభాతవార్త : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్‌ను ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి జస్టిస్ వి.బాల భాస్కర్‌రావుతో కలిసి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ప్రారంభించారు. బుధవారం మేడ్చల్ జిల్లా పరిధిలోని కుశాయిగూడలో ఉన్న జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్ ఛాంబర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి, జిల్లా న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావులు గవర్నమెంట్ ప్లీడర్ కె.రాంచందర్‌రెడ్డిని అభినందించారు.

ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి అమరావతి, నాల్గవ ఎడిజె డి.కిరణ్‌కుమార్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్‌అథారిటీ సెక్రెటరీ రవీందర్, ఫస్ట్ జూనియర్ సివిల్ జడ్జి రాజు, సెకండ్ జెసిజె ప్రశాంతి, మూడవ జెసిజె సరళరేఖ, సీనియర్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాపిరెడ్డి, జూనియర్ ఎజిపి సునితారాజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, యాక్టింగ్ ప్రసిడెంట్ సంజయ్, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీని రంగారెడ్డిలోనే ఉంచాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ప్రస్తుతం ఈ మెడికల్ కాలేజీని ఎల్బీనగర్‌కు తరలిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయని, ఇది స్థానిక ప్రజలకు అన్యాయం అవుతుందని విమర్శించారు.

శ్రీశైలం హైవేపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ ప్రాంతంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో బాధితులు హైదరాబాద్ చేరుకునేలోపు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని ఆమె అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు.మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం ప్రాంతాల్లో మెడికల్ కాలేజీ ఏర్పడితే 400 పడకల ఆసుపత్రి కూడా అందుబాటులోకి వచ్చి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం లభిస్తుందని వివరించారు. ఇప్పటికే కందుకూరులో స్థలం కేటాయించి, గతంలో హరీష్ రావు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందని తెలిపారు.ఎట్టి పరిస్థితుల్లోనూ మెడికల్ కాలేజీని ఎల్బీనగర్‌కు మార్చకుండా, కందుకూరులోనే కొనసాగించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖను ఆమె కోరారు. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రంగారెడ్డి జిల్లా ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాపాలన సమర్థవంతంగా నిర్వహించాలి

-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్, ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామా సభలు ఏర్పాటు చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు అదనపు కలెక్టర్ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

ఆదేశించారు. ఏప్రిల్ 2 నుండి వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. గ్రామ సభ, మండల ,నియోజకవర్గ పరిదిలో సభలు ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు, రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయం, సన్న బియ్యం బోనస్, రైతు భరోసా, రైతు భీమా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాలు ఇప్పటి వరకు ఎంత మంది లబ్ది దారులకు అందజేశారు, ఇంకా ఎంత మందికి ఇవ్వవలసి ఉంది, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు ఇప్పటి వరకు చేసిన వాటి పూర్తి సమాచారము తో లిస్టు సబ్మిట్ చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ వాసు చంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్, సిపి ఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్

బిడియాన్ని వదిలి కమ్యూనికేషన్ పెంచుకోండి

విద్యార్థులకు కలెక్టర్ హితవు

కీసర, మార్చి25, ప్రభాతవార్త : చదువు ఒకటే కాకుండా అభిరుచికి తగ్గట్టుగా అంశాలను ఎన్నుకుని వాటిపై నైపుణ్యతను పెంచుకోవాలని కలెక్టర్ మను చౌదరి విద్యార్థులకు హితవు పలికారు. బుధవారం నాగారం డివిజన్ పరిధిలోని నాగారంలో మైనారిటీ రెసిడెన్షియల్ (బాలికలు) స్కూల్, జూనియర్ కాలేజీని సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం ప్రతి రోజు అందించాలన్నారు. బోధన తీరుపై ప్రిన్సిపల్‌ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆత్మవిశ్వాసం ఉండాలని, బిడియాన్ని వదిలి నలుగురితో మాట్లాడాలని సూచించారు అప్పుడే ఎదుటి వ్యక్తులకు విద్యార్థుల సామర్థ్యంపై నమ్మకం కలుగుతుందన్నారు. టెక్నాలజీని వినియోగించుకుని ఎఐ టూల్స్ ద్వారా పెయింటింగ్, వెబ్ డిజైనింగ్, ప్రోగ్రామింగ్, ఫ్యాషన్ టెక్నాలజీని నైపుణ్యతను పెంచుకోవాలన్నారు. ఆడుకోవడానికి ఫుట్ బాల్, చెస్ కావాలని విద్యార్థులు కోరగా.. తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సర్పంచ్ వార్వల ఆంజిలయ్య

కుల్కచర్ల,మార్చి 25 ప్రభాతవార్త: విద్యార్థులకు నాణ్యమై బోజనం అందించాలని సర్పంచ్ వార్వల ఆంజిలయ్య,ఉప సర్పంచ్ విజయ్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగ్వాడి కేంద్రాని సందర్శించిసరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అంగ్వాడి విద్యార్థులకు నాణ్యమై పోషక పదార్థలను అందించాలన్నారు.బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న వన్ని సకాలంలో ఇవ్వలని తెలిపారు.

సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్

నందిగామ, మార్చి 25, ప్రభాతవార్త): నందిగామ మండలం బుగ్గోనిగూడ గ్రామంలో బుధవారం సర్పంచు బుగ్గ సాలయ్య ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బేబీ అనిల్, వార్డు సభ్యులు బుగ్గ భాస్కర్, బుగ్గ నవనీత నర్సింలు, బుగ్గ ప్రభాకర్, బుగ్గ రమేష్, దినకర్, మాజీ వార్డు సభ్యులు జి రామచంద్రి,బి నరేష్, గ్రామస్తులు బి శ్రీనివాస్, బి కుమార్, రవి, బి యాదయ్య, ఆర్ అశోక్, ఆర్ పాండు,బి శంకర్ ,బి యాదయ్య,బి నర్సింలు, బి భాస్కర్, బండి శంకర్, బి శేఖర్, ఎస్ పాండు, బుగ్గ ప్రవీణ్, ఆర్ శ్రీను తదితరులున్నారు.

అక్రమ అరెస్ట్ లతో విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరు

ప్రజాపాలనలో అక్రమ అరెస్టు?

ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ సెక్రెటరీ శివశంకర్

షాద్‌నగర్, మార్చి 24, ప్రభాతవార్త : అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రెటరీ శివశంకర్ అన్నారు. పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ముందస్తు అరెస్టు చేయడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునివ్వగా షాద్ నగర్ లో ఉన్నటువంటి ఎస్ఎఫ్ఐ నాయకులకు ముందస్తు అరెస్టు చేయడానికి తీవ్రంగా ఖండిస్తూన్నామన్నారు. ఒక పక్క విద్యార్థులకు పెండింగ్ లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని చెబుతున్న విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేయాలని విద్యారంగానికి కొఠారి కమిషన్ ప్రకారం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ ఉపాధ్యక్షులు ఆదిల్ నాయకులు చరణ్, సాయి తదితరులు అరెస్టయ్యారు.

సాకారమైన సొంతింటి కల

మేడ్చల్, మార్చి 25, ప్రభాతవార్త : మేడ్చల్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివసిస్తున్న మెట్ట

ఇందిరమ్మ ఇల్లు గ్రహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కుమారి చక్రధర్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం అత్యంత వైభవంగా జరిగింది. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులుగా ఎంపికైన ఈ దంపతులు, నేడు స్వగృహ యోగం పొందడం వల్ల సంతోషం వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా మేడ్చల్‌లోనే అద్దె ఇళ్లలో నివసిస్తున్న వీరికి ప్రభుత్వ సహకారంతో నిర్మించుకున్న ఈ ఇందిరమ్మ ఇల్లు తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొని నూతన గృహంలో అడుగుపెట్టిన దంపతులను శుభాకాంక్షలు తెలియజేశారు.

సమస్యలను పరిష్కరించాలని డిసిని కలిసిన నాయకులు

మేడ్చల్, మార్చి 25, ప్రభాతవార్త : మేడ్చల్ సర్కిల్‌లోని పూడూరు కిష్టాపూర్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై మేడ్చల్ డిప్యూటీ కమిషనర్‌ను బీఆర్ఎస్ నేతలు కలిశారు. కిష్టాపూర్‌లోని వీకర్ సెక్షన్ కాలనీలో డ్రైనేజీ వేసి రోడ్లు తవ్వి వదిలివేయడంతో వృద్ధులకు, చిన్న పిల్లలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని తెలిజేశారు. అదే విధంగా రోడ్లు గుంతలుగా మారి చాలా ప్రమాదంగా ఉందని, కొన్ని డ్రైనేజీలు పొంగి పొర్లడం దుర్గంధంగా మారిందని వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్ తుడుము గణేష్, నాయకుడు పవన్ కుమార్ కోరారు.

కిష్టాపూర్‌లో ఇబ్బందిగా మారిన రోడ్డు

చీపునుంత గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

తలకొండపల్లి మార్చి 25, ప్రభాతవార్త; తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని మంగళవారం నాడు ఎంపిక చేశారు. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ సమావేశమై నూతన గ్రామ కమిటీ అధ్యక్షులుగా రామచంద్రారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మిగతా శేఖర్, బీసీ సెల్ అధ్యక్షులుగా బత్తుల మల్లేష్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా గోస్కే శ్రీశైలం, తో పాటు 60 మందిని కమిటీ సభ్యులకు ఎన్నుకోవడం జరిగింది . అనంతరం మండల మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామంలోని సమస్యల పరిష్కారం కొరకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న, తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి సహాయం చేసిన సర్పంచ్

తలకొండపల్లి మార్చి 25, ప్రభాతవార్త; తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో బుధవారం నాడు గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న గ్రామంలో ఇల్లు నిర్మాణం చేస్తున్న నిరుపేదకు వ్యక్తిగతంగా సిమెంట్ పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి వ్యక్తిగతంగా ఆదుకుంటానని హామీ మేరకు వ్యక్తిగతంగా సాయం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామానికి వంగూరి నరసింహ, మిడత చేన్నమ్మ, వంకూర్ చంద్రమ్మ, కుర్ర అంజమ్మ, బత్తుల జయమ్మ ,ఇంజమూరి మంజుల, వంకూరి రాములు తదితర నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం సిమెంట్ బ్యాగులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్న లబ్ధిదార లు ఆర్థికంగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని వారికి సొంతంగా చేయూతను అందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ రవీందర్ రెడ్డి వెంకటరాజు రెడ్డి చంద్రమోహన్ రెడ్డి సరదా పెంటయ్య సాంబ వెంకటయ్య రఘుపతి యాదగిరి శివప్రసాద్ పెంటయ్య వెంకటయ్య యాదగిరి శివప్రసాద్ యాదయ్య రాములు తదితరులున్నారు.

పిల్లోనిగూడ ఉద్రిక్తత

భూవివాదంలో ఇరు వర్గాల ఘర్షణ

రంగారెడ్డి అర్బన్, మార్చి 25, ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పిల్లోనిగూడ గ్రామపంచాయతీ పరిధిలో భూ వివాదంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. కోర్టు ఆదేశాల మేరకు భూమి సర్వే చేయడానికి అధికారులను తీసుకువస్తే అడ్డుకుని ఘర్షణకు దిగారని భూమి యజమాని కట్కూరి సుభాష్ గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. ఘర్షణ నేపథ్యంలో పరిస్థితి ఉద్రుతంగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. భూ యజమాని సుభాష్ గౌడ్ మాట్లాడుతూ తన పట్టా భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భూ యజమాని కట్కూరి సుభాష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS — వార్త VAARTHA CLASSIFIEDS

LOST OF DOCUMENT

★ I, KAVALI NARENDER S/o. KAVALI RAMCHANDRAIAH R/o. H.No.2-89, Antharam (V), Kulkacherla (M), Vikarabad Dist, T.S. Plot No.52, at Thirumala Residency While I Am Travelling From Vikarabad To Pargi Bustand I Lost My Original Sale Deed Link Document No. 3060/2016. If Found Cont above Address.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కుల్కచర్ల, మార్చి 25, ప్రభాతవార్త: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ మడుగు శ్రీనివాస్, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డిఅన్నారు. బుధవారం మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామం శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఇల్లు, ప్రతి వీధి అద్దంలా ఉండేందుకు కృషి చేస్తున్నమని

సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో పాంబండ ఆలయ ఛైర్మన్ కొట్ల మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాంగీర్, హుషన్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ జన్మదిన వేడుకలు

కడ్తాల్, మార్చి 25, ప్రభత వార్త : తెలంగాణ రాష్ట్ర టాస్క్ సిఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు.

కడ్తాల్ మండల కేంద్రములో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభిమానుల కోలాహలం మధ్యలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు, ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ముద్విన్ పాఠశాలలో విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు, మార్చి25, ప్రభాతవార్త: కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బుధవారం ఐక్యత ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, తెలంగాణ రాష్ట్ర టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి జన్మదిన వేడుకలను అభిమానులు అట్టహాసంగా జరుపుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లోని అనిగ్రామాల్లో అభిమానులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలతో ఆయా ప్రాంతాల్లో పండగ వాతావరణంతో సందడి నెలకొన్నది.

30న పెద్దేముల్‌లో తైబజార్,వాటర్ ఫిల్టర్, షట్టర్లు వేలం

పెద్దేముల్, మార్చి 25, ప్రభాతవార్త: ఈ నెల 30న పెద్దేముల్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో తైబజార్, వాటర్ పిల్టర్ కేంద్రం, దుకాణముల సముదాయంలోని 1 నుంచి 9 షట్టర్లను వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి లాలప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి లాలప్ప మాట్లాడుతూ ఎప్రిల్ 1 నుంచి మార్చి 2027 వరకు గల ఆర్థిక సంవత్సరానికి గాను తైబజార్, వాటర్ పిల్టర్ కేంద్రం, షట్టర్లను ఈ నెల 30న సోమవారం ఉదయం గం 10:30లకు వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాలొనేవారు ఉదయం 8:30 నుంచి 10:00 గంటల లోపు ఒక్కొక్క వేలానికిరూ, 17 వేలు డిపాజిట్ చెల్లించాలని అన్నారు. ప్రతి వేలమునకు అప్లికేషన్ ఫీజు రూ. 500 చెల్లించాలని అన్నారు. ఇట్టి వేలములో పై వాటిని దక్కించుకున్న వారు అదే రోజు మిగిలిన మొత్తం రూపాయిలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డివై నర్సిములు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్ పాల్గొన్నారు.

కీసరలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన

కీసర, మార్చి25, ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు నియమాలు పాటించాలని ట్రాఫిక్ సిఐ శివశంకర్ కోరారు. బుధవారం కీసర సర్కిల్‌లో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వాహనదారులు ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్,సీటు బెల్టు ధరించాలని సూచించారు. రోడ్డు నియమాలు పాటించడం వలన ప్రాణాలను కాపాడు కోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కీసరలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ శివశంకర్

మంచి మనసు చాటిన మున్సిపల్ వైస్ చైర్మన్

టెన్త్ విద్యార్థులకోసం టీచర్‌ను నియమించి జీతం అందజేత

మొయినాబాద్, మార్చి 25, ప్రభాతవార్త : టెన్త్ విద్యార్థుల కోసం టీచర్ ను నియమించి, సొంత డబ్బులతో జీతం ఇచ్చి మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు మంచి మనసును చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే .. హిమాయత్‌నగర్ జెడ్‌పిహెచ్ఎస్ లో పనిచేస్తున్న మ్యాథ్స్ టీచర్ ఆరు నెలల కింద ప్రమోషన్ పై వెళ్లారు. తర్వాత కొత్త టీచర్ ఎవరూ రాలేరు. ఈ విషయం తెలుసుకున్న మెయినాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గరుగు రాజు విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకూడదని భావించి జీ ఆర్ ఫౌండేషన్ తరఫున టెన్త్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రైవేట్ మ్యాథ్స్ టీచర్ మహేందర్ ను నియమించారు. ఆయనకు బుధవారం సొంత డబ్బులతో జీతం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు దిక్సూచి అని కొనియాడారు. వారి కోసం తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లయ్య, ప్రధానోపాధ్యాయురాలు జులేక సుల్తానా ఉపాధ్యాయులు రాములు, అరుణ, శైలజ. రాములు, భాగ్యలక్ష్మి ్మ, సుమిత్ర, సుగుణ, రవి టీచర్స్ ఎస్ఎంసి చైర్మన్ మహేశ్వరి నాయకులు చదువు రామచందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కండి!

జిల్లెడు చౌదరిగూడ, కొందుర్గు, మార్చి 25,(ప్రభాతవార్త): గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యులందరూ భాగస్వాములు కావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు లక్ష్మి ్మ అనురాధ, ప్రవీణ్‌కుమార్ కోరారు. బుధవారం పంచాయతీ వార్డు సభ్యులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ వార్డు సభ్యుల విధి విధానాలు తెలుసుకోవాలని, ప్రజా సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని కోరారు. వార్డు సభ్యులు ప్రజలతో నేరుగా సంబంధాలు ఉన్న ప్రజాప్రతినిధులని అన్నారు. తప్పకుండా ప్రతి సభ్యుడు శిక్షణా తరగతుల లో పాల్గొనాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి విజయకుమార్ పాల్, హన్మంత్‌రెడ్డి సీనియర్ అసిస్టెంట్ గణపతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ లక్ష్మీఅనురాధ

అసెంబ్లీ ముట్టడికి తరలిన గిరిజనులు

జిల్లెడు చౌదరిగూడ, మార్చి 25,(ప్రభాతవార్త): జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా తాండాల నుంచి బుదవారం అసెంబ్లి ముట్టడికి గిరిజనులు తరలి వెల్లారు. ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విదించిన గిరిజనులు అసెంబ్లి ముట్టడికి వెల్లారు. తమ హోకుల్ల సాధన కోసం ప్రభుత్వంపై నిరసన తెలిపినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయక్, మోతిలాల్‌నాయక్, రాజు నాయక్, జగన్ నాయక్, పరశురామ్‌నాయక్, శివనాయక్, నాగేష్‌నాయక్, నరేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

మహిళా సమాఖ్య భవన స్లాబు పనులు ప్రారంభం

జిల్లెడు చౌదరిగూడ, మార్చి 25,(ప్రభాతవార్త): జిల్లెడు చౌదరిగూడ మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో బుదవారం మహిళ సమాఖ్య భవన స్లాబు పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నిధులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోయో రోజులలో ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం అనేక నిధులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నీలయ్య, బందయ్య, మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

స్లాబు పనులు ప్రారంబిస్తున్న చలివేంద్రంపల్లి రాజు

సాంకేతిక విద్యను ప్రోత్సహించేందుకు కృషి

కొడంగల్, మార్చి 25,ప్రభాతవార్త:

సాంకేతిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని, అందులో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను అందిస్తున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హస్నాబాద్‌లో రూ.1.86కోట్ల కడా నిధులతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి రేణుకాదేవితో కలిసిఆయన ప్రారంబించారు. అనంతరం గ్రా సర్పంచ్ అద్యక్షతన పద్మమ్మ అద్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాంకేతిక విద్యకు అధిక ప్రాదాన్యత కల్పిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ప్రాథమిక స్థాయి పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రారంబిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న కాలనుగుణంగా ప్రతి ఒక్కరికి కంప్యూటర్ నేర్చుకోవడం ఎంతో అవసరమని, అందులో భాగంగా ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ విద్యను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్ విద్యతో పాటు హస్నాబాద్‌లో క్రీడలను ప్రోత్సహించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి

మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి

రేణుకాదేవి మాట్లాడుతూ జిల్లాలో 132 పాఠశాలల్లో కంప్యూటర్లు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,వైస్ చైర్మేన్ శంకర్‌నాయక్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మేన్ రాజేశ్‌రెడ్డి, ఎంఈఓ రాంరెడ్డి, పాఠశాల ప్రాధానోపాధ్యాయులు నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు తూర్పు భీములు, కొడంగల్ నయ్యూం, పర్సాపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలి

మాట్లాడుతున్న యంఈఓ

..మండల విద్యాదికారి నర్సింగ్‌రావు

పెద్దేముల్, మార్చి 25, ప్రభాతవార్త: మూడవ తరగతి విద్యార్థులు ఎఫ్ఎల్ఎస్ పరిక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని మండల విద్యాధికారి నర్సింగ్‌రావు అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలంలోని ఎంపిపిఎస్ పాషపూర్, ఎంపిపిఎస్ తట్టెపల్లి, ఎంపిపిఎస్ తట్టెపల్లి (హరిజనవాడ) పాఠశాలలను యంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ ఈ నెల 30,31వ తేదిలలో మూడవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎస్ పరీక్షలలో విద్యార్థులందరు బాగా రాసేటట్లు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అంతేగాకుండా ప్రతి తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద తీసుకొని ఎఫ్ఎల్ఎన్ మెరుగుపడేలా చూడాలని సూచించారు. ఎస్సెటు పరీక్షలు ఏప్రిల్ 10న ప్రారంభంమవుతున్నాయని, విద్యార్థులందరిని ప్రిఫేర్ చేసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు.

మంబాపూర్ 4 వార్డులో తాగునీటి తంటాలు

..తొమ్మిది నెలలుగా తప్పని తాగు నీటి తిప్పలు

..ప్రత్యేక అధికారులకు విన్నవించిన ఫలితం శూన్యం

పెద్దేముల్, మార్చి 25, ప్రభాతవార్త: పెద్దేముల్ మండలం మంబాపూర్ 4వ వార్డులో గత తొమ్మిది నెలలుగా (మిషన్ భగిరథ) తాగునీరు రావడంలేదని కాలనీ వాసులు జి.రాజవర్ధన్‌రెడ్డి, నాడెపల్లి రాము, జి.హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4వ వార్డుకు గత తొమ్మిది నెలలుగా మిషన్ భగిరథ నీరు రావడంలేదని ప్రత్యేక అధికారికి, మిషన్ భగిరథ ఏఈకు విన్నవించిన ఫలితం లేకపోయిందని ఏకరువు పెడుతున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి 4వ వార్డులో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను తీర్చాలని

పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్,శ్రావన్, వార్డు మెంబర్ తెరువటి నర్సిములు తదితరులు ఉన్నారు.

శాఖ గ్రంథాలయాన్ని సందర్శించిన పాఠశాల విద్యార్థులు

చిన్న వయస్సు లోనే పుస్తక పఠనం అలవర్చు కోవాలి

బంట్వారం, మార్చి 25, ప్రభాతవార్త: పుస్తక పఠనం చిన్న వయస్సు నుంచే అలవర్చు కోవాలని విద్యా నికేతన్ పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశం అన్నారు. బుధవారం మండల కేంద్రం లోని శాఖ గ్రంథాలయాన్ని గ్రంథ పాలకుడు ఆహ్వానం మేరకు విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ, గ్రంథాల యాలు విజ్ఞాన బాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకో వాలని ఆయన తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయం ద్వారా ఎంతో అద్భుతమైన పరిజ్ఞానాన్ని పొందవచ్చు అని అన్నారు. నేటి సమాజంలో గ్రంథాలయం యొక్క పాత్ర చాలా అద్భుతం అని దానిని సక్రమంగా వినియోగించుకుంటే విద్యార్థులు అపర మేధావులుగా తయారవుతారని తెలిపారు. గ్రంథాలయం అనేది ప్రపంచంలోని జ్ఞానాన్ని తెలిపే గురు కేంద్రంగా పనిచేస్తుందని, గ్రంథాలయాలను సక్రమంగా వినియోగించుకుంటే ఒక విద్యార్థి ఏదైనా సాధించవచ్చు అని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాదించడానికి గ్రంథాలయం సంపూర్ణ జ్ఞానాన్ని అందించే ఒక గురువుగా పనిచేస్తుందని అన్నారు. ఈ గ్రంథాలయాలను సక్రమంగా వినియోగించుకున్న వ్యక్తులు ఒక సైంటిస్ట్ గా, ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతమైన అధికారులుగా, ప్రొఫెసర్లుగా తీర్చిదిద్దే ఒక అద్భుతమైన ప్రయోగశాల మన గ్రంథాలయాలు అని అన్నారు.

మండలంలో వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభం

ధారూర్, మార్చి 25, ప్రభాత వార్త: ధారూర్ మండల పరిధిలోని ప్రజాప్రతినిధులకు తమ విధులతో పాటు ప్రభుత్వ పాలనపై పట్టు సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బుధవారం ధారూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక, స్త్రీ శక్తి భవనం, ఎంపీడీవో కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) సఫీ ఉల్లా ఖాన్ ఈ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. ఆయా కేంద్రాలను సందర్శించిన ఆయన, వార్డు సభ్యులకు వారి హక్కులు, బాధ్యతలు, గ్రామ పంచాయతీల అభివృద్ధిలో వారు అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయిలో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వార్డు సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. వేర్వేరు వేదికల్లో జరిగిన ఈ శిబిరాలకు వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శిక్షణలో భాగంగా పంచాయతీ రాజ్ చట్టంపై సభ్యులకు ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, శిక్షకులు, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీఓ షఫీ ఉల్లా ఖాన్

నిరంతరం కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదు

కీసర, మార్చి25, ప్రభాతవార్త: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును ఎంచుకోవాలని హోళీమేరీ ఇంజనీరింగ్ కళాశాల ఫౌండర్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని హోళీమేరీ కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. సెక్రటరీ విజయశారదరెడ్డి, వివిద రంగాలకా చెందిన ప్రముఖులతో కలిసి కళాశాల చైర్మన్ సిద్ధార్థరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. .ఒక సంవత్సరం పాటు పూర్తిగా అకడమిక్ రిలేటెడ్ టెక్నాలజీ బెస్ట్ ప్రోగ్రామ్స్ చేయాలని సంకల్పించినట్టు తెలి పారు. ఇది విద్యార్థుల కెరీర్ డెవలప్‌మెంట్ కోసం టెక్నోక్రోట్స్ ,ఐటి ప్రొఫెషనల్స్‌ని తయారు చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఇక్కడికి వచ్చిన అతిధులు తాము ఉన్న రంగాల్లో ఎంతో ప్రతిభ పాటవాలతో ముందుకు వచ్చారని వారినుండి స్ఫూర్తిని పొందానని హితవు పలికారు. కళాశాల డైరెక్టర్ ప్రీతిరెడ్డి మాట్లాడుతూ రోమన్ సామ్రాజ్యం ఒక్క రోజులో కట్టబడలేదని అలాగే హోళీమేరీ కళాశాల కూడా ఒక్క రోజులో ప్రారంభించబడలేదని, ఇది నిరంతర శ్రమ, కష్టపడే తత్వం, ముందు చూపు గల వరప్రసాద్‌రెడ్డి ,విజయ శారదరెడ్డి దంపతుల కఠోర శ్రమకి నిదర్శనమని అన్నారు. సెక్రటరీ అరమంద విజయశారదరెడ్డి మాట్లాడుతూ కళాశాల 1999 సంవత్సరంలో స్థల సేకరణకు కీసర ప్రాంతానికి వచ్చామని అప్పుడు ఈ ప్రాంతమంత అడవి, రాళ్లతో నిండివుందని నక్కలు, ముళ్లు, పందులు, నెమళ్లు, వేళ్ల జీవులు ఇక్కడ తిరుగుతూ ఉండేవని పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఫౌండర్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి నేను ఈ రాళ్ళ మీద కూర్చుని దీనికి రూపకల్పన చేశామన్నారు. ఏజిఎం చెట్టినాడ్ సిమెంట్స్ అధినేత మురుల్ రావు మాట్లాడుతూ హిట్స్ కళాశాల సిల్వర్ జూబ్లీకి రావడం సంతోషంగా ఉందన్నారు .ఒక ఇన్స్టిట్యూట్‌ని అభివృద్ధిలోకి తీసుకురావాలంటే ఎంత కష్టమో తనకు తెలుసుఅన్నారు. ఐ పేజ్ గ్రూప్ ఆఫ్ కంపె నీస్ ఫౌండర్ రాజు

విద్యార్థులకు డ్రోన్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కళాశాల ఫౌండర్ వరప్రసాద్‌రెడ్డి,ముఖ్య అతిధులు

మాట్లాడుతూ మిమ్మల్ని చూస్తుంటే నాకు నా కాలేజీ రోజులు గుర్తుకు వస్తున్నాయని విద్యార్థులతో అన్నారు. ఈ కాలేజీతో నాకు 2 సంవత్సరాల అనుబందంగా డ్రోన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇక్కడి ప్రారంభంతోనే ఇది కుదిరిందని చెప్పారు. తొలి బ్యాచ్‌లో 24 మంది డిజిసిఏ అప్రూవ్డ్ సర్టిఫికేట్లను సంపాదించారని తెలిపారు. ఐటి స్కూల్ హైదరాబాద్ ఫౌండర్ ఆర్ఎన్ రెడ్డి మాట్లాడుతూ టీచింగ్ అనేది చాలా గొప్ప పవిత్రమైన వృత్తి అని తాను ప్రారంభంలో ఇద్దరు విద్యార్థులతో ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించానని తరువాత 2009లో హిట్స్ విద్యార్థులను 30 మందిని తన ఇన్‌స్టిట్యూట్ పంపించారని ఆ విషయాన్ని తాను ఎప్పటికి మర్చిపోలేనన్నారు. సెంచూరియన్ యూని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రశాంత మోహంటి మాట్లాడుతూ తనకి స్టేజి మీద విసిగా ఉండటం కంటే ఒక ప్రొఫేసర్‌గా విద్యార్థులతో మమేకం అవ్వడం ఎక్కువ ఇష్టమని అన్నారు. ఇటువంటి ప్రొఫేషనల్ కాలేజీ వల్ల దేశాభివృద్ధి చాలా ఎక్కువగా జరిగిందని అలాగే విద్యార్థుల కెరీర్ కూడా చాలా మెరుగుపడిందని అన్నారు. అనంతరం ముఖ్య అతిధులు 24 మంది విద్యార్థులకు డ్రోన్ సర్టిఫికెట్లు అంద జేసి సిల్వర్ జూబ్లీ అభినందనలు తెలియజేశారు.

చంద్రాయన్‌పల్లి పాఠశాల విద్యార్థుల ఘన విజయం

-గురుకుల్ సెట్-2026లో 7 మంది ఉత్తీర్ణులు

- సర్పంచ్ రమేష్ రెడ్డి హర్షం

మాడ్గుల, మార్చి 25, ప్రభాత వార్త : చంద్రాయన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు టీఎస్ గురుకుల్ సెట్-2026లో విశేషప్రతిభ కనబరిచి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. మొత్తం 8 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, అందులో 7మంది ఉత్తీర్ణులై వివిధ గురుకుల పాఠశాలలో ప్రవేశాలు పొందడం విశేషం. ఉత్తీర్ణులైన విద్యార్థులు: తాండ్ర రోహిత్, అల్లే జస్వంత్, తాండ్ర నందిని, బైకని దీప్తి, జెనిగల ఇందు, మెన్దే వర్షిని, బైకని రిశ్విక.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రమేష్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చిన ఈ విజయానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అలాగే గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఈ స్థాయికి తీసుకువచ్చిన పాఠశాల ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. ఇదిలా ఉండగా, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో గ్రామపంచాయతీ ఆందోళన వ్యక్తం చేసింది. పాఠశాల అభివృద్ధి కోసం గ్రామస్తులంతా చైతన్యంతో ముందుకు వచ్చి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరింది.

ఇంటి నిర్మాణానికి చేయూత

ఆమనగల్లు, మార్చి 25, ప్రభాతవార్త: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 5వవార్డు నవచైతన్య కాలనీకి చెందిన ఈర్లపల్లి యాదమ్మ ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పిటిసి, బిఆర్ఎస్ పార్టీ నేత ఉప్పల వెంకటేష్ ముందుకు వచ్చి ఆపేదింటి నిర్మాణానికి సాయం అందించారు. ఈమేరకు బుధవారం నూతన ఇంటి నిర్మాణ స్లాబ్ పనులను స్థానిక వార్డు కౌన్సిలర్, ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5వ వార్డులోని పేదలను ఆదుకోవడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. గూడులేని నిరుపేదలకు ఇళ్లనిర్మాణంలో తాను ఎప్పుడూ అండగా ఉంటా నని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయ కులు వస్పుల సాయిలు, జంతుక కిరణ్, మాజీ ఎంపిటిసి చలిచీమల యాదమ్మ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మల్లేష్, శ్రీను నాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ పాపిశెట్టిరాము

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరు

ఆమనగల్లు, మార్చి25, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అక్రమ అరెస్టులతో లంబాడీల హక్కుల పోరాటాన్ని ఆపలేరని రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ తీవ్రంగా హెచ్చరించారు. కడ్తాల్ మండల కేంద్రంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లే క్రమంలో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ,ఎస్టీలకు న్యాయం చేయలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. లంబాడీలకు సంబంధించిన కీలక సమస్యలను పట్టించుకోకుండా, వారి హక్కులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

లంబాడీల ఆధ్యాత్మిక ప్రేరణ అయిన సేవాలాల్ మహారాజ్ విగ్రహంతో పాటు దేవాలయాన్ని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మించాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలతో చైతన్యం పొందుతున్న లంబాడీలను అడవి ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయకుండా సమగ్ర అభివృద్ధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో గత రెండేళ్ల కాంగ్రెస్ పాలన వంచన, దగా, నమ్మకద్రోహానికి ప్రతీకగా మారిందని విమర్శించిన ఆయన రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులందరినీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఆరు గ్యారంటీలు, పదమూడు డిక్లరేషన్లు, వందలాది హామీలలో ఒక్కటీ సక్రమంగా అమలు కాలేదని ఆరోపించారు. ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని, అవినీతి పాలనకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తామని జర్పుల దశరథ్ నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సేవ్య నాయక్, రామ్ చందర్ నాయక్, శ్రీను నాయక్, మాజీ సర్పంచులు తులసిరామ్ నాయక్, శ్వేత భూనాథ్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ శారద, పాండు నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

కుల్కచర్ల, మార్చి 25, ప్రభాతవార్త: వలసల నివారణకు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసు కోవాలని సర్పంచ్ గడ్డం వెంక టయ్య పేర్కొన్నారు. బుధ వారం మండల పరిధిలోని పిరం పల్లి గ్రామంలో ఫీల్డ్‌అసిస్టెంట్ వెంకటయ్య స్థానికులతో కలిసి ఉపాధి హామీ పనులను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండల పెరిగొపోవడంతో రైతులు ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేసుకోని ఇంటికి చేరుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో తాగునీరు తప్పకుండా తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, సీనియర్ నాయకులు జి. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కుల్కచర్ల, మార్చి 25, ప్రభాతవార్త: వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి మండల వైద్య అధికారి కిరణ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో వైద్య సిబిర కేంద్రం నిర్వహించారు. గ్రామ ప్రజలకు బిపి, షుగర్ తదితర పరిక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాఉతూ..ప్రభుత్వం రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపడుతుందని 30 సంవత్సరాలపై బడిన ప్రతి ఒక్కరూ బిపి, షుగర్ తదితర పరిక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రభూపాల్ రావు, మార్కెట్‌కమిటి చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొడంగల్, మార్చి 25, ప్రభాతవార్త: కొడంగల్ మండల పరిధిలోని వివిధ గ్రామాలతో పాటు కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి పంపిణీ చేశారు. బుధవారం స్థానిక కడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 38 మంది లబ్దిదారులకు ప్రభుత్వం నుండి మంజూరైన కళ్యాణలక్ష్మీ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల పెళ్ళిళ్ళకు మేనమామలా సీఎం రేవంత్‌రెడ్డి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందించడం జరుగుతుందన్నారు .అనంతరం లబ్దిదారులకు ఒక్కొక్కరికి రూ.1లక్ష116 చొప్పు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ వైస్ చైర్మేన్ శంకర్ నాయక్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, చిన్న నందిగామ సర్పంచ్ దత్తాత్రేయరావు, తహశీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

మాల్ సంత వేలం పాటలో పాల్గొన్న సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామ సెక్రెటరీ

మాల్ సంత వేలం పాట కోటి ఐదు లక్షల అరవై రెండు వేలు

యాచారం,మార్చి25, ప్రభాతవార్త : యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామ పంచాయతీ సంత వేలం పాట బుధవారం నిర్వహించగా కోటి ఐదు లక్షల అరవై రెండు వేల రూపాయలు పలికింది. సర్పంచ్ బెల్లి అశోక్, కార్యదర్శి రాజు , వార్డు సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేలం పాటలో మాల్ గ్రామానికి చెందిన నిమ్మరాజు జంగయ్య అంగడి సంతను కోటి 5 లక్షల 62 వేలకు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. అంగడి నుండి వచ్చిన డబ్బులను అంగడి మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం కృషి చేస్తానన్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది మరో మారు జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు అందేలా అభివృద్ధి చేస్తానన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాల అవగాహన కార్యక్రమం

యాచారం, మార్చి 25, ప్రభాతవార్త: శాంతియుత వాతావరణంలో శ్రీరామన ఉత్సవాలు నిర్వహించాలని యాచారం సిఐ నందీశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం యాచారం మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీలో నిర్వహించబోయే శ్రీరామనవమి సందర్భంగా ఉత్సవాల నిర్వహణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ విని యోగం, ఏర్పాట్లు సజావుగా చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ లు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమం మాట్లాడుతున్న సీఐ నందీశ్వర్ రెడ్డి

అర్హులందరికీ రైతు భరోసా

యాచారం,మార్చి 25, ప్రభాతవార్త: అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందుతుందని దిగులు చెందొద్దని యాచారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహణ అధ్యక్షులు మోటి శ్రీశైలం అన్నారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో మోటె శ్రీశైలం, సంఘం మల్లేష్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతు భరోసా ఒక ఎకర లోపు అర్హులైన వారందరికీ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని. త్వరలో అరులైనవారందరికీ నిబంధనల ప్రకారం సాగుచేస్తున్న రైతులకు రైతుభరోసా అందు తుందని ధీమా ఇచ్చారు. గతంలో అన్నరులకు కూడా రైతు బంధు అందించారని నేడు సాగు చేసుకునే రైతులకు రైతు భరోసా అందుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా నిరుపేదలకే అందుతాయి అన్నారు. ఇందిరమ్మ ఇల్లు ఇలాంటి పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అంది నేడు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

విలేఖరులతో మాట్లాడుతున్న మోటె శ్రీశైలం, సంగం మల్లేష్

ఓటరు జాబితాలో తప్పులు సరిచేయాలి

పూడూరు, మార్చి 25, ప్రభాతవార్త : బిఎల్ఓలు,సూపర్‌వైజర్లు ఓటర్ల జాబితాపై పున:సమీక్ష నిర్వహించాలని తహశీల్దారు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పూడూరు మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పున:సమీక్ష –ఎలక్టోరల్ మ్యాపింగ్‌పై బిఎల్ఓలు,బిఎల్ఓల సూపర్‌వైజర్లకు సమన్వయ ,సన్నాహక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్ఓలు ఇంటింటికి తిరిగి ఓటరు మ్యాపింగ్‌ను నిర్వహించాలని, సూపర్ వైజర్లు ఓటరు జాబితాపై పర్యవేక్షించాలని సూచించారు. ఓటరు జాబితాలో డబుల్ పేర్లు లేకుండా చూడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పాండు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పూడూరు రైతువేదికలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు విజయ్‌కుమార్ తదితరులు

రైతుల సమస్యలు పరిష్కరించాలి

మాడ్గుల,మార్చి 25,ప్రభాతవార్త: రైతుల రుణమాఫీ పూర్తిగా అమలు చేయకపోవడం, రైతు భరోసా నిధులు సమయానికి అందకపోవడం వల్ల అప్పుల బాధలు పెరిగి నిరుపేద రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మాడ్గుల మండలంలోని సుద్దపల్లి,ఆసిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులను మాటల్లోనే పొగడ్తలు కురిపిస్తోందని, కానీ ఆచరణలో చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ఆర్బీఐ నుండి రైతుల భరోసా కోసం తీసుకున్న నిధుల్లో భాగంగా కొంత మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేయడం ఏంటని ప్రశ్నించారు. మిగిలిన నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు లక్షల వరకు ఉన్న రైతు రుణాలను ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. యూరియా సరఫరా యాప్ విధానంలో లోపాలు సరిచేసి, రైతులకు సమయానికి ఎరువులు అందించాలని అన్నారు. సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, భూ భారతి మార్గదర్శకాలలో సాదా బైనామా నిబంధనలు సవరించాలని సూచించారు. పంట భీమా పథకాన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయాలని, భూమి సర్వేలకు గడువు నిర్ణయించి 30 రోజుల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు నెలకు 10 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, ఆన్లైన్‌లో నమోదు చేసుకున్న రైతులకు వెంటనే రైతు క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోలు ప్రసాద్, బి.విజయ్, బి.రాంరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు, సీపీఐ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

-బంట్వారం సర్పంచ్ మల్లేశం

బంట్వారం, ప్రభాతవార్త : మండల కేంద్రంలో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా జరుగడం లేదని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని బంట్వారం సర్పంచ్ దుర్గం చెరువు మల్లేశం అన్నారు. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన పనులు ప్రస్తుతం సంబంధిత కాంట్రాక్టర్లు పనులు చేస్తుండటంతో బుధవారం గ్రామ సర్పంచ్ మల్లేశం గ్రామంలో పర్యటించి పనులు పరిశీలించారు. పనుల విషయమై మీడియాతో మాట్లాడారు. గ్రామంలో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులు పూర్తిగా నాసిరకంగా వేస్తున్నారని, అధికార పార్టీ అండ ఉందనే ఉద్దేశంతో ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బంట్వారం మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ క్రింద ప్రతి గ్రామానికి సిసి రోడ్లు మంజూరు అయ్యాయని, గ్రామాలలో సిసి రోడ్లు వేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడడం మంచి పరిణామమేనని, ఇదే అదునుగా భావించి సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నాసిరకం రోడ్లు వేయడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఆయన మండిపడ్డారు. మండల కేంద్రంలో సంబంధిత కాంట్రాక్టర్ ఇసుక లేకుండా నాసిరకం డస్ట్, తక్కువ పరిమాణం గల కంకర, తక్కువ మోతాదులో సిమెంటు వినియోగించి సిసి రోడ్లు వేస్తున్నారని తెలిపారు. ఇదే తీరుగా సీసీ రోడ్డు పనులు చేపడితే రెండు మూడు నెలల్లో రోడ్లు ధ్వంసం కావడం ఖాయం అని విమర్శించారు. నాసిరకం రోడ్లకు ఇంజనీర్లు ఎలా బిల్లులు చెల్లిస్తారని, మామూళ్ళకు తలొగ్గి అధికారులు బిల్లులు చెల్లిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. క్షేత్రస్థాయిలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు పర్యవేక్షించి, సిసి రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టేలా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నాసిరకంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు

లక్ష్మాపూర్‌లో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శామీర్‌పేట, మార్చి 25, ప్రభాతవార్త: లక్ష్మాపూర్‌లో శ్రీసీతా రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమైనాయి. ఈ నెల 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐదు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలోని శ్రీరాములగుట్ట (శ్రీసీతారామచంద్రస్వామి) ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమైనాయి. బుధవారం ఆలయం ప్రాంగణంలో యజ్ఞ హోమాలు, అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ నెల 27న ఉదయం 11గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వార్షిక బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంకరార్పణ చేశారు. సుప్రభాత సేవ మంగళ వాయిద్యం గోష్టి, వేద పారాయణం, నిత్యార్చన, శ్రీరామకాశి విశ్వనాథ స్వామికి రుద్రాభిషేకం మహాగణపతి పూజ, విశ్వక్సెన్ పూజ. పుణ్య హవచనం, పంచగవ్యం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ చిత్తయ్యగౌడ్, వైస్‌చైర్మన్ సత్యనారాయణ, లక్ష్మాపూర్ గ్రామ పెద్దలు చిన్నలచ్చ శ్రీనివాస్, బండి జగన్నాథం, క్యాతం మధుకృష్ణ, కటికెల గోపి, బండి రవీందర్, తోట పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు తొలిరోజు పూజలు యజ్ఞ,హోమాలు, అభిషేక పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ చిత్తయ్యగౌడ్, తదితరుల దృశ్యం

వైభవంగా ఆంజనేయ దేవస్థాన విగ్రహ, ధ్వజస్థంభ ప్రతిష్టాపన

రంగారెడ్డి అర్బన్ మార్చి25,ప్రభాతవార్త : దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు .బుధవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్ దొడ్డిలో ఆంజనేయ దేవస్థాన విగ్రహ ,ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంమాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని, శాస్త్రోక్తంగా జరిగిన విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేకి ఆలయ కమిటీ సభ్యులు మరియు బండి గోపాల్ యాదవ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తి మార్గం మనిషికి మానసిక ప్రశాంతతను ఇస్తుందని, ఇంద్రానగర్ దొడ్డిలో ఇంతటి అద్భుతమైన దేవాలయాన్ని నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. కాలనీ ప్రజలందరికీ ఆ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్లు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంజనేయ దేవస్థాన విగ్రహ ప్రతిష్ట పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

తూంకుంటలో పేరుకుపోయిన చెత్తను వెంటనే డంపింగ్‌యార్డుకు తరలించాలి

..డిప్యూటీ కమిషనర్,అసిస్టెంట్ కమిషనర్‌లతో చర్చించిన

..తూంకుంట మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్

శామీర్‌పేట, మార్చి 25, ప్రభాతవార్త : తూంకుంట ప్రాంతంలో చెత్తపేరుక పోయిందని వెంటనే డంపింగ్‌యార్డుకు తరలించాలని తూంకుంట గ్రామ మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్ కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు తెలిపి ఆ తరువాత అసిస్టెంట్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో ఆయన చర్చించారు. బుధవారం శామీర్‌పేట మండలం జిహెచ్ఎంసి పరిధిలోని తూంకుంట ప్రాంతంలో చెత్తను సేకరించటం లేదని చెత్త ఎక్కడిక్కకడే పేరుకపోతుందని వెంటనే అధికారులు స్పందించి తొలగించాలని లేదా డంపింగ్‌యార్డునకు తరలించాలని కీసర సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకవెళ్లటం జరిగిందని ఆ తరువాత సంబంధిత అసిస్టెంట్ కమిషనర్ శ్రావణ్‌కుమారనతో చర్చించినట్లు ఆయన తెలిపారు. గతంలో చెత్తను జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలించటం నిలిపివేయటంతో కాలనీలవాసులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. చెత్త పేరుకుపోవటంతో దుర్వాసన రావటం, అనారోగ్యాలకు ప్రజలు గురువతున్నారని సమస్యలు పెరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి వారు స్పందించి చెత్తను త్వరలోనే తొలగించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపినట్లు మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ద్వారకాపురికాలనీ ప్రసిడెంట్ యాదవరెడ్డి, రాజిరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

.తూంకుంట ప్రాంతంలో చెత్తపేరుకపోయిందని వెంటనే డంపింగ్‌యార్డుకు తరలించాలని ఎసితో చర్చించిన తూంకుంట మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్,పాల్గొన్న తదితరుల దృశ్యం

కొల్తూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, పాల్గొన్న మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, మాజీ వైస్‌ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, తదితరుల దృశ్యం

కొల్తూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం..గృహప్రవేశం

..మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్

శామీర్‌పేట, మార్చి 25, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కావటంతో దాన్ని మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశలు ప్రారంభించి లబిదారులతో కలిసి గృహప్రవేశం చేయించారు. బుధవారం మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కొల్తూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తితో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ లు మాట్లాడుతూ నిరుపేదలకు స్వంతింటి కలను నెరవేర్చటానికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణంకు ప్రభుత్వం మంజూరు చేయటంతో సకాలంలో ఇళ్లు నిర్మించటం, గృహప్రవేశం చేసుకోవటం హర్షించదగ్గ విషయమన్నారు. గత పదిహేను సంవత్సరాల నుంచి ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి స్వంతింటి కలను తీరుస్తున్నారని అన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మాజీ వైస్‌ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పాపిరెడ్డి, బి.మల్లేశ్‌యాదవ్, మాజీ ఎంపిటిసి బి.వెంకటేశ, మాజీ సర్పంచు శిల్పయాదగిరి, కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ, గురువయ్య, నర్సారెడ్డి, కమిటీ సభ్యులు పాండు, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, అనంతరెడ్డి, శేఖర్‌రెడ్డి, నవీన్, అంజనేయులు, మహేశ్, కరుణాకర్‌రెడ్డి, దేవేందర్‌రావు, భస్వారెడ్డి, జైపాల్‌రెడ్డి, లతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో తహసిల్దార్ లకు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కౌన్సిలర్లు

డంపింగ్ యార్డుకోసం స్థలాన్ని కేటాయించండి

చేవెళ్ల, మార్చి 25, ప్రభాతవార్త : చేవెళ్ల మున్సిపాలిటీలోని చెత్తను నిలువ చేసేందుకు డంపింగ్ యార్డు అవసరమని అందుకోసం 5 ఎకరాల భూమిని మున్సిపల్ చైర్ పర్సన్ తో పాటు కౌన్సిలర్లు ఆర్డీవో తాసిల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి నర్సింలు, మనగమ్మమల్లేష్, దూత మల్లేష్, కృష్ణానాయక్ లు మాట్లాడుతూ రోజురోజుకు విస్తరిస్తున్న నగరీకరణ కు అనుగుణంగా చెత్త వేసేందుకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలన్నారు. దీంతో స్పందించిన చేవెళ్ల ఆర్డీవో కె. పార్థ సింహారెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య విషయాన్ని పరిశీలించి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తామని హామీ ఇచ్చారని, డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని పరిశీలిస్తామని ఆర్డీవో, తహశీల్దార్ లు సానుకూలంగా స్పందించారని చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదిరెడ్డి, చందు తదితరులు ఉన్నారు.

హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ రజితదేవయ్యగౌడ్

మాడ్గులలో మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

మాడ్గుల,మార్చి25,ప్రభాతవార్త: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మాడ్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ రజితా దేవయ్యగౌడ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఉప జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు గర్భకోశ సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు గైనకాలజిస్టును సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ మోహన్ మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత, కంటి, పంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో మొత్తం 479 మంది సేవలు పొందారు. అందులో స్త్రీలకు సంబంధించిన వారు 115 మంది, కంటి సమస్యలతో 102 మంది, దంత సమస్యలతో 85 మంది, ఎముకలకు సంబంధించిన105 మంది, పిల్లల సమస్యలతో 72 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల ఉప సర్పంచ్ శరత్ రెడ్డి, మాజీ ఎంపీపీ జంగయ్య, డివిజన్ సిబ్బంది సీహెచ్ఓ రామయ్య, హెచ్ఈ బ్రిజిత, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జీఎస్టీ జాతీయ సదస్సు..

మొయినాబాద్, మార్చి 25, ప్రభాతవార్త : మండలంలోని కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జీఎస్టీ జాతీయ సదస్సు బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కళాశాలలోని ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో "తెలంగాణలోని గృహ ఆర్థిక వ్యవస్థపై జీఎస్టీ సంస్కరణల ప్రభావం" అనే అంశంపై రెండు రోజు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని రిటైర్డ్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గురువారెడ్డి, మరియు అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్. శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో జీఎస్టీ ఒక విప్లవాత్మక మార్పు అని, ఇది పన్నుల విధానంలో పారదర్శకతను పెంచిందని పేర్కొన్నారు.

సామాన్య ప్రజల దైనందిన జీవితంపై మరియు గృహ బడ్జెట్‌లపై జీఎస్టీ చూపే సానుకూల ప్రభావాలను ఆయన సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ యు. పద్మావతి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, సదస్సు కన్వీనర్ డాక్టర్ సారిక కొలుగూరి, కోకన్వీనర్ శ్రీమతి చ. చందన, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

వార్డు సభ్యుల శిక్షణ శిబిరంలో ఎస్సై

(నందిగామ మార్చి 25 ప్రభాతవార్త) గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కిలకమని.. అందుకు సర్పంచుకు చేదోడు వాదుగా ఉండి గ్రామ అభివృద్ధి వికాసానికి తోడ్పాటు అందించాలని నందిగామ ఎస్సై దేవరాజ్ స్పష్టం చేశారు. బుధవారం నందిగామ మండల కేంద్రంలో బుధవారం జరిగిన వార్డు సభ్యుల శిక్షణా శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. ఓటు హక్కు ద్వార ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన వార్డు సభ్యులు వారికి అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

వార్డు సభ్యుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎస్సై దేవరాజ్.

గురుకుల ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు

గురుకుల ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులు

-ఒకే పాఠశాల నుండి ఏకంగా 36 మంది విద్యార్థులు ఎంపిక

దౌల్తాబాద్,మార్చి 25,ప్రభాతవార్త: కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం గోకఫస్లావాద్ గ్రామంలోని ఫైనీయర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో సత్తా చాటారు. మంగళవారంరోజు విడుదలైన 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ఫేజ్–1 ఫలితాల్లో ఫైనీయర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఒకే విద్యాసంవత్సరంలో, ఒకే పాఠశాల నుండి ఏకంగా 36 మంది విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలలకు ఎంపికై తమసత్తా చాటారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సరైన శిక్షణ, పట్టుదల ఉంటే ఎంతటి విజయాన్నైనా సాధించగలరని ఫైనీయర్ విద్యార్థులు నిరూపించారు.

యాజమాన్యం, ఉపాధ్యాయుల హర్షం:

విద్యార్థులు ఈ అద్భుత విజయానికి కారణమైన ఉపాధ్యాయ బృందాన్ని, పట్టుదలతో చదివిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడమే తమ ప్రథమ కర్తవ్యమని వారు ఈ సంధర్భంగా పేర్కొన్నారు. మండలంలోనే ఒకేసారి ఇంతమంది విద్యార్థులు గురుకులాలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, విద్యావేత్తలు సంతోషం వ్యక్తం చేశారు. ఎంపికైన 36 మంది విద్యార్థులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయబృందం, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్వాడి భవనం ప్రారంభించిన సర్పంచ్

అంగన్వాడి భవనం ప్రారంభిస్తున్న సర్పంచ్

కుల్కచర్ల,మార్చి 25, ప్రభాతవార్త: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాడమే తమ లక్ష్యమని సర్పంచ్ రవీందర్ నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చెరువు ముందలి తాండ (ఎ) గ్రామ పంచాయతీలో అంగన్వాడి భవనం నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలు అంగన్వాడి భవనం లేక తీవ్ర ఇబ్బందు ఎదుర్కొన్నామని నేడు తమ అధ్వర్యంలో అంగన్వాడి భవనం నిర్మణం చేపట్టడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోఅనేక అభివృద్ధి పనులు వేనుపడ్డ గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని సూచించారు.

పుకార్లతో బంకుల వద్ద రద్దీ

- అపోహలు నమ్మొద్దని పోలీసుల విజ్ఞప్తి

- ఇంధన కొరత లేదని ఇన్స్పెక్టర్ నరసయ్య భరోసా

కొత్తూరు, మార్చి 25, ప్రభాతవార్త; తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న పుకార్లు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి నుండి కొత్తూరు పురపాలకలో పెట్రోల్ బంక్‌లలో భారీగా వాహనదారులు విపరీతంగా స్తంభించిపోయాయి .దీంతో ఇన్స్పెక్టర్ నరసయ్య సిబ్బందితో పెట్రోల్ బంక్‌లో సందర్శించి తెలంగాణ లో పెట్రోల్‌కు కొదవలేదని విన్నవించారు. పెట్రోల్ దొరకలేక బంకులు మూతపడుతున్నాయని వచ్చిన వదంతవులన్నీ కల్పితం మాత్రమే అన్నారు. ఇలాంటి చర్యలు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దీనిపై తెలంగాణ పోలీస్ శాఖ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇచ్చింది. రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇటీవల తప్పుడు ప్రచారాల కారణంగా కొంతమంది ప్రజలు పెట్రోల్ బంకుల వద్దకు భారీగా తరలివెళ్లి ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయడం వల్ల కొన్ని చోట్ల తాత్కాలిక ఇబ్బందులు ఏర్పడినట్లు పేర్కొన్నారు. అయితే ఇది కొరత వల్ల కాదని, పానిక్ బయ్యింగ్ వల్ల జరిగిన పరిణామమని వెల్లడించారు. తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తూ, రాష్ట్రంలో హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ సంస్థల ద్వారా సరిపడా ఇంధనం సరఫరా అవుతోందని తెలిపింది. సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని పేర్కొంది.

అణచివేతకు లొంగం..

హక్కుల కోసం పోరాటం

కొత్తూరు, మార్చి 25, ప్రభాతవార్త; చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు మీట్టు నాయక్, కొత్తూరు మండల అధ్యక్షుడు బాబురాజ్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ రమేష్ నాయక్, పూర్య నాయక్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బాబురాజ్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీటి సరఫరా కోసం పైప్‌లైన్ నిర్మాణంకు శంకుస్థాపన

..అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి

శామీర్‌పేట, మార్చి 25, ప్రభాతవార్త

లాల్‌గడిమలక్‌పేట్‌లోని శివాలయం కట్ట నుంచి ఎస్సీ కాలనీ ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు వరకు నీటి సరఫరా కోసం పైప్‌లైన్ ఏర్పాటుకు (నిర్మాణంకు) అలి యాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు.

బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సి పల్ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్ శివాలయం (14వ వార్డు) నుంచి వాటర్ ట్యాంకు వరకు పైప్‌లైన్ ఏర్పాటుకు ఆమె శంకుస్థాపన చేశారు. అలియాబాద్ మున్సిపల్ జనరల్ ఫండ్ 7లక్షల రూపాయలతో చేపట్టె మంచినీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆమె ముహుర్తం చేశారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.చంద్రశేఖర్, వార్డుల కౌన్సిలర్లు కైర గణేశ్, తాళ్ల స్వప్న, తలారి మౌనిక, గుర్కల దీప, గాదె వెంకటేశ, ఎల్లుదీపిక, గూదె వెంకటేశ, మౌనిక వంగరి, సరసం వనజ, సామల జశ్వంత్‌రెడ్డి, ఎజిజ సనా షాహిన్, గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నీటి సరఫరా కోసం పైప్‌లైన్ నిర్మాణంకు శంకుస్థాపన చేసిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి